క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్‌కో ఈఈ వీవీ కిశోర్ కుమార్ ఆదేశాల మేరకు గరుగుబిల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్న తరుణంలో వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

సీతంపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ ఎంవీఐ టి.వేణుగోపాలరావు, ఏఎంవీఐ జీఎస్ఎస్ ఆర్‌కే కుమార్, మెడికల్ ఆఫీసర్ పీవీ రామారావు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోవడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ పీవీ రామారావు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

97.28 శాతం పింఛన్ల పంపిణీ

పార్వతీపురం: ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ పథకంలో పింఛన్లను ఆగస్టు ఒకటవ తేదీ తొలి రోజున గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి జిల్లాలో 97.28 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో 1,43,398 మంది లబ్ధిదారులకుగాను 1,39,515 మందికి రూ.57.96 కోట్లు పంపిణీ జరిగింది. జిల్లాలో పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లను, క్షేత్ర స్థాయిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని మండల ప్రత్యేకాధికారులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, వైద్యసిబ్బందితో పింఛన్ల పంపిణీకి ఏర్పాటు చేశారు. కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు జిల్లాలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు.

మండలానికి 25 గోశాలలు

సీతానగరం: మండలంలో 25 గోశాలలు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు అన్నారు. మొదటి విడతగా వీటిని మంజూరు చేసినట్టు గురువారం చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక త్వరలోనే చేపడతామన్నారు. అవసరమైన వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూగజీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు.

వర్గీకరణతో ఎంతో మేలు

బలిజిపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షించదగ్గదని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ గురువారం తెలిపారు. వెనుకబడిన ఎస్సీలకు దీనితో మేలు జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అవసరం ఉందన్నారు. రాష్ట్రాలకు దీనిపై వెసులుబాటు ఉండాలని సుప్రీంకోర్టు చెప్పడం ఎంతో గొప్ప విషయమన్నారు. దీనిని స్వాగతిస్తున్నామని తెలిపారు.

బెలగాం 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ కిశోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బెలగాం 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ వర్కులు, ట్రీ కటింగ్ కారణంగా ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని చర్చివీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ బ్యాక్‌సైడ్ గల కాలనీ, గూడ్స్‌షెడ్ రోడ్డు, జనశక్తి కాలనీ, నాయుడువీధి, బంగారమ్మ కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అంటిపేటలో వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పావని

సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ కార్యాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 32 మందికి వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధుల కాలం దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు శర్మ, భవాని, సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశాలు తమ వంతు సేవలు అందించారు.

నిఘా నీడలో..

సాలూరు: పట్టణ ప్రధాన ముఖద్వారాలు వద్ద సీసీ కెమెరాలను పోలీసు ఏర్పాటు చేస్తోంది. గుర్తించిన ప్రాంతాల్లో రాష్ట్రమంతటా ఈ విధంగా సీసీ కెమెరాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన చోటే కొత్తగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

గరుగుబిల్లి: తల్లిపాల వారోత్సవాల్లో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ ఇందుమతి, తదితరులు



పాలకొండ రూరల్ : తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దశారత్నం



● ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి..

పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ అధికారులు, వైద్యాధికారులు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో గురువారం అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తల్లిపాల ఆవశ్యకతను తెలుసుకుని బిడ్డకు ఆరు నెలలు వచ్చేవరకు పాలు పట్టాలని వక్తలు తెలిపారు. వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహించనున్నారు.

– పాలకొండ రూరల్/గరుగుబిల్లి

దోమలను తరిమికొడదాం..



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

సీతంపేట: దోమలను తరిమికొడదామని మలేరియా యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు గురువారం పిలుపునిచ్చారు. మండలంలోని బంజారుగూడకు చెందిన కె.నాగమణికి మలేరియా పాజిటివ్ రావడంతో గురువారం ఇంటింట ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అలాగే ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

వేతన బకాయిలు చెల్లించండి



ఎంపీడీఓ గీతాంజలికి వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘ నాయకులు

సీతంపేట: ఉపాధి హామీ వేతనదారులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని గిరిజన సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ గీతాంజలిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేతనాలు అందక వేతనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, శ్రీరాములు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వీయ పర్యవేక్షణలో పింఛన్ల పంపిణీ



అట్టలి గ్రామంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీలో సమస్యలు లెత్తకుండా స్వీయ పర్యవేక్షణ చేపట్టామని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని 32 పంచాయతీల పరిధిలో 22 సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖలకు చెందిన సిబ్బంది గురువారం ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఈఓపీఆర్‌డీతో కలిసి పంపిణీని పరిశీలించానని తెలిపారు. మండలంలోని 7,362 మంది పింఛన్‌దారులకు గాను 6,732 మందికి నగదు అందించినట్లు చెప్పారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

వీరఘట్టం: మండలంలోని పనసనందివాడలో జరిగిన ఓ వివాహ వేడుకలో వధూవరుల కుటుంబాల మధ్య జరిగిన తగాదాలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ తగాదాకు సంబంధించి ఎస్సై గురువారం తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరఘట్టం రెల్లివీధికి చెందిన అమ్మాయి, పనసనందివాడకు చెందిన అబ్బాయికి బుధవారం పనసనందివాడలో వివాహం జరిగింది. వివాహం జరిగిన తర్వాత నవ వధూవరులను ఊరేగిస్తుండగా జరిగిన తగదా చినికి చినికి గాలివానలా మారి కొట్లాటకు దారి తీసింది. ఈ తగాదాలో ఇరువర్గాలకు చెందిన బొమ్మాళి జీవరత్నం, సిరిపురం శశికుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై ఇరువర్గాల్లోని పది మందిపై కేసు నమోదు చేశారు.

పరిశీలన



వాచ్‌టవర్ పనులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

సీతంపేట: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వాచ్ టవర్ నిర్మాణ పనులను ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులు వేగవంతం చేయాలన్నారు. క్రైమ్ వివరాలు, రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, ఎస్సై జగదీష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భామిని: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో బురుజోల, పసుకుడి సెక్షన్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ ఏవీఎస్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పార్వతీపురం టౌన్: డీఎస్సీ 2024 టెట్ పరీక్షలకు మన్యం జిల్లాలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీఈఓ జి.పగడాలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా బేస్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బేస్‌మెంట్ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆశక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల7లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు యొక్క ప్రతిని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

స్లూయిజ్‌ను బాగు చేయండి

భామిని: వంశధార నదీ తీరంలోని తాలాడ కుల్లుడు బట్టీ స్లూయిజ్ పూడుకుపోవడంతో కుల్లుడు బట్టిలోకి సాగునీరు రావడం లేదని తాలాడ, ఘనసర ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దృష్టికి సమస్యను తీసుకెళ్లి గురువారం దగ్గరుండి స్లూయిజ్‌ను పరిశీలించారు. స్లూయిజ్‌ను బాగు చేయిస్తే ఆయకట్టుకు నీరు అందుతుందని రైతులు వలరౌతు మన్మధరావు, భూపతి ఆనందరావు, తదితరులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అగతముడి గోవిందరావు, పోలాకి రాంబాబు, సవలాపు రపు రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


బలిజిపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ స్థానిక కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, బోర్డు నిధులు రూ.2వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జయ చేయాలన్నారు. ఇసుక రీచ్ పాయింట్లకు అవకాశం ఇచ్చి భవన నిర్మాణ కార్మికులకు పని కలిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఇతరులకు ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

మక్కువ: మండల కేంద్రం నుంచి పార్వతీపురం, బొబ్బిలి పట్టణాల్లోని కళాశాలలకు విద్యాభ్యాసం నిమిత్తం వెళ్తున్న పలువురు విద్యార్థులు తోటి ప్రయాణికులను, విద్యార్థినిలను ఇబ్బంది పెడుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతుండడంతో మక్కువ ప్రధాన రహదారి వద్ద పోలీసులు గురువారం ప్రత్యేక నిఘా పెట్టారు. కళాశాలల నుంచి బస్సుల్లో వచ్చిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు బాధ్యతగా చదువుకోవాలని ఇతరులను ఇబ్బంది పెట్టే చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

వెన్నశాతం తగ్గితే నష్టమే..

- యాజమాన్య పద్ధతుల్లో మార్పులు చేపడితే సమస్యను అధిగమించవచ్చు
- పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ప్రభా మాణిక్యరావు



పాలు తీస్తున్న పాడిరైతు

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో పాలలో వెన్నశాతం తగ్గడంతో పాడిరైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. దీనిని అధిగమించేందుకు యాజమాన్య పద్ధతుల్లో స్వల్ప మార్పులు చేపట్టాలని పశుసంవర్ధకశాఖ పాలకొండ సహాయ సంచాలకుడు (ఎ.డి) ప్రభామాణిక్యరావు తెలిపారు. ఈ నేపథ్యంలో పాలలో వెన్నశాతం పెంచేందుకు పలు సూచనలు చేశారు. పశువులకు అందించే దాణాలో పీచు పదార్థాలు తక్కువగా ఉండడంతో పాటు పశుగ్రాసం కూడా తక్కువగా ఇవ్వడం వల్ల పాలలో వెన్నశాతం తగ్గుతుంది. పశువులు తిన్న ఆహారం నాణ్యంగా లేకపోవడంతో పాల దిగుబడితో పాటు వెన్నశాతం తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుత సీజన్‌లో శుభ్రత పాటించకపోవడం వల్ల పొదుగు సంబంధిత వ్యాధులు కూడా చోటుచేసుకుంటాయి. గ్రామాల్లో పాడిపశువుల నుంచి వచ్చిన పాలను డెయిరీ కేంద్రాలకు విక్రయించడం పరిపాటి. ఈ సమయంలో పాలలో ఉన్న వెన్న శాతాన్ని ధ్రువీకరించి దానికి అనుగుణంగా డబ్బులు చెల్లిస్తారు.

సహజ కారణాలు ..

వర్షాకాలంలో పాలలో వెన్నశాతం తగ్గడం సహజం. ఈ సమయంలో పశువులు తక్కువ పీచుపదార్థం, ఎక్కువ చక్కెర ఉండే దాణాను తీసుకుంటాయి. ఈ కారణంగా సమస్య ఉత్పన్నమవుతుంది. పశువులు అధికంగా పాలిచ్చే దశలో ఈ సమస్య ఎక్కువగా, చివరిదశలో కొంతమేర తక్కువగా ఉంటుంది. దీన్ని నివారించేందుకు పాలను ఉంచే పెద్ద పాత్రను ప్రతి ఐదు నిమిషాలకు ఒకసారి పూర్తి స్థాయిలో కదుపుతూ ఉండాలి. అలాగే రోజూ ఒకే సమయానికి పాలు పితకాలి. దాణాలో పీచు, పిండి పదార్థం తక్కువగా ఉండేటట్టు చూడాలి. పశువుకు అందించే దాణాలో మాంసకృతులు, న్యూట్రల్ డిటర్జెంట్ పీచు పదార్థాలు, బూడిద, కొవ్వు, గంధకం వంటి పదార్థాలను సమతుల్యతను పరీక్ష చేయించి తెలుసుకోవాలి. లోటుపాట్లు గుర్తించి నిమిషాలలో దాణాలో పౌష్టికత ఉండేటట్టు చూడాలి. పశుగ్రాసాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి వేయడం వల్ల అవి తొందరగా అరుగుదలకు వస్తాయి. దాణాలో ఉండే సూక్ష్మజీవులను తొందరగా అరిగించుకోగలుగుతాయి. ధాన్యాన్ని పులియబెట్టి వాటిలో ఉండే పిండిపదార్థాలు మెత్తబడే విధంగా చేసి పశువులకు దాణా రూపంలో అందించాలి. ముఖ్యంగా వేడి చేసిన ధాన్యం మేత 35 నుంచి 40 శాతం మించకుండా చూడాలి. మొత్తం దాణాలో 55.5 శాతం మించకుండా కొవ్వుపదార్థాలు ఉండడం వల్ల వాటిలో ఉండే సూక్ష్మజీవుల ద్వారా వచ్చే నష్టాన్ని తగ్గించుకోవచ్చు. పశువులు మేతను ఏ విధంగా ఆరగిస్తున్నాయో గమనించడం ద్వారా ఎన్నిసార్లు వాటికి ఆహారం అవసరం ఉంటుందో తెలుసుకోవాలి. అందుబాటులో ఉన్న మేత వల్ల పశువులకు కలిగే నష్టాలను అంచనా వేయడంలో రైతులు అధికారుల సలహాలు పాటించాలి.



ప్రభా మాణిక్యరావు, పశు సంవర్ధక శాఖ ఎ.డి

కేజీబీవీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం: రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 1వ తేదీ నుండి పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు కార్యక్రమంలో భాగంగా కురుపాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం నేత్ర వైద్య సహాయకులు రమేష్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు నెలలు పాటు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. దృష్టి దోషం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తుందని, అలాగే నేత్రాలకు సంబంధించిన ఎటువంటి శస్త్ర చికిత్సలు అవసరమైతే వారికి ఉచితంగా ప్రభుత్వ, కార్పొరేటు ఆస్పత్రులలో చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ఐ.కిరణ్‌కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేయాలని ఆందోళన



పెదమేరంగి కూడలి వద్ద రాస్తారోకో చేస్తున్న సీపీఎం శ్రేణులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద రహదారి పూర్తిగా గోతుల మయం కావడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారని దీన్ని మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు గురువారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వేలలో వాహనాలు కురుపాం, గుమ్మలక్ష్మీపురం మీదుగా ఒడిశా వెళ్తున్నాయని అన్నారు. వర్షం పడితే చాలు మూడు అడుగుల లోతు ఏర్పడుతుందని దానితో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వెంటనే చర్యలు తీసుకొని రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, జిల్లా సహాయ కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్యతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ మేరకు గురువారం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టిన ఎస్ఐ బి.శివప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ వరకు మావోయిస్టు వారోత్సవాలున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, అక్రమ రవాణా జరగకుండా తమ సిబ్బందితో కలిసి తనిఖీలు ముమ్మరంగా సాగిస్తున్నామని, అనుమానితుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలియజేశారు.

ఉత్తమ ఫలితాల సాధనపై దృష్టి

- ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని చిన మంగళాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్య, వారికి అందించిన యూనిఫారాలు, పుస్తకాలు, హాజరుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈయన వెంట హెచ్ఎం జామి రవి, తతదిరులున్నారు.

చెరకు వంగడాలపై అవగాహన



చెరకు రైతులకు అవగాహన కలిస్తున్న నిపుణులు

పాలకొండ : చెరకు రైతులకు సంకిలి ఈఐడీ ప్యారీ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సాగులో మెలకువలు, అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఏవీపీ పట్టాభిరామరెడ్డి మాట్లాడుతూ, అధునాతన పద్ధతులు అవలంభించడం వల్ల దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు. ఆర్‌అండ్‌డీ హెడ్ డాక్టర్ రాజేశ్వరి, కేన్ హెడ్ రమేష్ రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

భామిని : రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఉద్యానవన శాఖాధికారి పేడాడ జయశ్రీ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై పామాయిల్ మొక్కలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక ఆదాయం పొందడానికి రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. పామాయిల్ సాగుతో 20 నుంచి 30 ఏళ్లపాటు ఆదాయం పొందవచ్చని చెప్పారు. శ్రీనివాసా పామాయిల్ కంపెనీ మేనేజర్ జి.వీరబాబు ఆధ్వర్యంలో స్థానిక రైతులు గురుగుబిల్లి లక్ష్మీపతి నాయుడు, జి.సురేష్ నాయుడు పొలంలో ఎమ్మెల్యే జయకృష్ణ ఉద్యానవన శాఖాధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం భామిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు అందజేశారు. అలాగే సచివాలయం వద్ద పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో భామిని సర్పంచ్ లోపింటి రాజేశ్వరి, టీడీపీ నాయకులు నిమ్మక పాండురంగ, లోపింటి రాజేష్, మేడిబోయిన జగదీష్, బోగాపురపు రవినాయుడు, భూపతి ఆనందరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కురుపాం: మండల కేంద్రంలోని కోర్టు సమీపంలో వాహన చోదకులకు, ప్రజలకు రహదారి భద్రతపై బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ గురువారం అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, పరిమితికి ప్రయాణికులను ఎక్కించకూడదని, ప్రతీ వాహనదారుడు సంబంధిత ధ్రువ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పైడితల్లి, హెడ్ కానిస్టేబుల్ శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 85 రద్దు చేయాలి

నెల్లిమర్ల రూరల్: పీజీ ప్రవేశాల్లో ప్రభుత్వ వైద్యుల ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జీఓ 85ను వెనక్కి తీసుకోవాలని వైద్యులు కోరారు. ఈ మేరకు ఒమ్మి గ్రామంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవిని గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో ఉండేలా పీజీలో ప్రవేశాలకు ఇన్‌సర్వీస్ కోటాను ఉంచాలని కోరారు.